కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# నారకోటు

ఆదం ఇవేళ జోరుగా నడుస్తున్నాడు. వాలునీటిమీద తెప్ప కొయ్యలా వీధి కిరువైపుల కూర్చునున్న జనం చూపుల మధ్య ఒదిగొదిగి సర్రున జారిపోతున్నాడు. ఎత్తిన తెరచాపలా రొమ్ము విరుచుకుని మరీ అడుగులేస్తున్నాడు.

రెండుమూరల గుడ్డ నడుముకు చుట్టుకుని, పేదరికపు మరకలు పడ్డ చిరుగుల చొక్కాతో, పీలికలైన నల్లటికంబళి భుజానేసుకుని, ఒకచేత పెద్దబొక్కు లాంతరు, మరోచేత పొటుకర్రతో వయోభారంతో పుసూరుమంటూ వెళ్తూ, చేవదేలని గడకర్రలా వుండే ఆదంను సాయంత్రం వేళ రోజూ చూస్తూనే వుంటారు.

అయితే ఈరోజు మాత్రం వాడిలో ఒక ప్రత్యేకత అయస్కాంతంలా అందర్నీ ఆకర్షించింది. మూడొంతులకు పైగానే వాడిని మింగేసిన నల్లకోటు అపరిచితుడైన వ్యక్తిలా అందర్నీ అయో

మడుంలో పడేసింది.

దూరం నుండి చూసి తేలిగ్గా పోల్చుకోలేక పోయాడుగాని అందరికీ చిరపరిచితమైన డొక్కు లాంతరు, పోటుకర్ర వాడి అస్తిత్వాన్ని వెల్లడించాయి.

"ఓరీడు ఆదంగాడు గదంట్రా! ఇవ్వాళ కొత్త అవతారం ఎత్తేడే!" అంటూ అంతా ఒకటే నవ్వటం.

ఆదంకు మాత్రం ఇవ్వాళ క్రొత్తజన్మ ఎత్తినట్లే వున్నది. ఆతగాడి హుషారంతటికీ మూల కారణం వంటిమీదున్న ఆ కోటే!

"ఏవిట్రా ఈ వేషం!" పలకరించాడు ఒక రైతు.

"దొరకోటండీ...మానోళ్లిచ్చారు!" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

"దొరకోటేవిట్రా?"

"ఇది ఇదేశాల్లో దొరలేసుకునేదంటండి. మాబోటి పేదోళ్లకిమ్మని పంపినారంట."

"కొత్తదిలానే వుందే!" అన్నాడింకొక ఆసామి.

"అవునయ్యా! యాడ సిన్న సిరుగన్నా దిలేదు." చెప్పాడు మురిపెంగా.

"ఆఁ! కొత్తయ్యి వదిస్తార్లే! దొరలు పసలాగ చిరుగులు పట్టి చీకిపోయేదాక వేసుకుంటారా! కొన్నాళ్ళు తొడుక్కునే పంపి వుంటారు."

"అయితే మాత్రం బంగారంలాంటి కోటు ఇత్తానికి ఎవ్వరికి పేనం ఒప్పుద్దండీ! దరమ ప్రభువులు దొరలు!" అన్నాడు ఆదం

కృతజ్ఞతతో తలమునకలుగా.

"మొత్తానికి మతం పుచ్చుకున్న వాళ్ళపని బాగానే వున్న ట్లుంది. ఏదోకటి ఇస్తూనే వున్నారు."

"అంతా ఆ ప్రభువుదయ!" భక్తిగా అన్నాడు ఆదం ఆకాశం లోకి చూస్తూ.

"ఈసారిస్తే నాకూ ఒకటి తెచ్చివ్వరా ఆదం! ఉత్తినే ఇవ్వ ట్డలే, డబ్బులిస్తాను." అన్నాడొక రైతు.

"డబ్బుల కాశపడి ఇంత మంచి కోటు అమ్ముకునే ఎర్రినా కొడుకెవరండయ్యా!" అన్నాడు ఆదం బెట్టుగా.

"పెద్ద చెప్పొచ్చావులేరా! మిషనోళ్ళిచ్చిన పేంటులు, చొక్కాలు, కోటులు మీ పల్లెవాళ్ళంతా వేసుకునే తిరుగుతున్నారా? పదికో, పాతికో అమ్ముకోవటంలా?" అన్నాడు రైతు.

ఆదం ముఖం చిన్నబుచ్చుకున్నాడు. ఆ ఆరోపణలో వున్న నిజం ఆదంకు తెలుసు. పల్లెలో బట్టలు పంచారని ఏ కాకి కబురందిస్తుందోగాని పట్నం నుండి సైకిళ్ళేసుకుని మనుషులొస్తారు. గుడ్డసుబట్టి, అమ్మే వ్యక్తిని బట్టి పాతికా, యాభై చేతిలో పెట్టి సాయంత్రానికల్లా తలోమూట మోసుకెళ్తారు. ఆ బట్టల్ని పట్నంలో అధిక లాభాలకు అమ్ముకుంటారని ఆదంకు ఎవరో చెప్పారు.

మిషనరీ వాళ్ళు ఇచ్చిన బట్టల్ని అమ్ముకునే వాళ్ళను పెడా మడా తిట్టిపోసేవాడు.

"వంటిమీద కప్పుకోను బట్టలేదని దయతో ఇత్తే ఇదేం పనిరా, ఎర్రినాయాల్లారా! ఇలాంటి బట్ట జనమలో కొనగలమా!"

అంటూ వాళ్ళమీద కస్సుమనేవాడు.

"వాల్లే పూరుకో ముసలోడా! ఆల్లిచ్చారని బుసుకోటులు, పేంటీలు ఏసుకెల్తానికి మనమేవన్నా కలకటేరు గుమస్తాలవా!మట్టి పిసుక్కునే కూలెధవలం. ఈ రోజయినా దొరల పేరు సెప్పుకొని కడుపు కింత తినొచ్చు." అంటూ ఆదం మీద విరుచుకుపడేవాడు.

"ఏందిరా ఆలోచన! నాల్రూపాయలెక్కువే ఇస్తాన్లే." రెట్టించాడు ఆ రైతు.

"అయ్యా! బుద్ధిమాలినోల్లు ఎవురయినా అమ్మితే ఆల్లకాడే కొనుక్కోండి. నే నమ్మను. అయినా మీ బోటివోల్లకు ఈ కరమ ఎందుకండీ. కావాలంటే పట్నం ఎల్లి చిటికెలో తెచ్చుకోగల్రు."

"ఆఁ! ఇంత పనుకలో దొరకొద్దూ. ఏదో చలి బాగా కాసుద్దనిగాని వందలుపోసి కొనటం పరమదండగ." అన్నాడా రైతు.

"అద్సరేగానొరే! సూరయ్యగారి చేలో వరికుప్ప పగలదీశారంటగదా! నువ్వేం చేస్తున్నట్లు?" అడిగాడో రైతు.

"నేను సూడబట్టేగదండీ, గింజ రాలక ముందే తరిమి కొట్టింది. మైలు దూరంలో గడ్డి పరకలు గలగలలాడినా నా చెవ్వల పడతదండి. కర్ర తీసుకు నిలబడ్డానంటే ఆల్లో నేనో తేలిపోవాల." అన్నాడు ఆత్మ విశ్వాసంతో ఛాతీ విరిచి.

"సరె సర్లే! గాలి తిరుగుళ్ళకు అలవాటుపడ్డ పుర్ర గాడిపల పన్లే ఇవి....జాగ్రత్త." హెచ్చరించాడు ఓ కామందు.

"వత్తానయ్యా! పొద్దు వాలతా వుంది....ఓ పొగాకు పాయ ఎట్టండిబాబు!" అంటూ దోసిలి పట్టాడు.

ఆ రైతు ఒక పొగాకు కాడ ఆదం దోసిట్లో వేశాడు. నల్లగా నిగనిగలాడుతున్న ఆ కాడ చూస్తూనే వాడి కళ్ళు మిలమిల మెరిశాయి. కాడ ముక్కు దగ్గరుంచుకుని గుండెలంటేలా వాసన పీల్చి ఆ ఘాటుకు మహదానంద పడ్డాడు.

"ఎంతయినా యీరయ్యగారు చరమరాజే!" అంటూ హుషారుగా ముందుకు సాగేడు.

దారి పొడుగునా ఆదంకు ఒకటే పలకరింపులూ, పరామర్శలూను....అందుకు కారణం వాడి ఒంటి మీదున్న కోటే!

ఊరు దాటి పొలాల్లో అడుగు పెట్టేసరికి మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆగి దీపం వెలిగించి ముందుకు సాగేడు. రోజూ పొలాల్లోకి అడుగు పెట్టగానే రివ్వున వీచే చలిగాలికి వళ్ళు బిగిసినట్లయి అడుగులు పడేవికావు. అలాంటిది ఈ రోజు వంటి మీదున్న కోటు శరీరాన్ని వెచ్చబరుస్తుంటే చేల గనేల మీద చక చకా నడుస్తున్నాడు.

ఈ రోజు ఆదంను నడిపిస్తున్నది కండరాల బలం కాదు. ఈ జీవితానికి తీరదనుకున్న కోరిక తీరిన సంతోషం వాడికి నూతనో త్తేజాన్నిచ్చింది.

రాత్రిళ్ళు చల్లగాలికి వాడి ముసలి శరీరం తట్టుకోలేక పోతున్నది. అవయవాలు కొంగర్లు తిరిగి బాధతో విలవిలలాడి పోతున్నాడు. ఒకో రోజయితే చలికి ప్రాణం నిలువునా పోతుందేమో

అనిపించేది. చలికి కాసుకునేందుకు గట్టి దుప్పటయినా లేదు. కాళ్ళు వేళ్ళు పడితే ఎవరో ఒక చిరుగుల కంబళి ఇచ్చారుగాని అదీ పనికి రానిదయింది.

ఊళ్ళో చలి కోట్లు వేసుకున్న వాళ్ళను చూసినప్పుడల్లా తనూ అలాంటి కోటు ఒకటి సంపాదించాలని ఆరాట పడేవాడు. కొందామంటే డబ్బులేదు. చలికోటు వాడిపట్ల కొండంత కోరికలా మిగిలిపోయింది. అయితే ఇన్నాళ్ళకు అనుకోకుండానే అదృష్టం కలిసొచ్చింది ఆదెంకు.

తల్లిచేత గోరు ముద్దలు తినే వయసులోనే ఓ కామందు ఇంటి పాలేరయినాడు. పెళ్ళయి ఓ ఇంటి వాడయినాక పాలేరుగా మానేసి స్వతంత్రుడయ్యాడే కాని పని మాత్రం మారలేదు. ఇద్దరు పిల్లల తండ్రయాడు. ఏ రోజు కూలి ఆ రోజు కూటికే! కూలి లేని రోజు పొయ్యి మీద కుండ ఎక్కటం కష్టమయ్యేది. రోగాలు రొష్టులతో ఆదాయంలో తలకు మించిన తీసివేతలేగాని కూడికలు లేవు.

కూతుర్ని రెక్కల సత్తువున్న ఓ అయ్య చేతిలో పెట్టాడు. కాయ కష్టం చేయగల ఒక కూలిపిల్లని కొడుక్కి జతచేసి వేరు కాపురం పెట్టించాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే డబ్బుకు తప్ప పొంగని జబ్బుతో ముసల్ది తీసుకు తీసుకుని గుటుక్కుమన్నది. వండిపెట్టే ఆడదిక్కులేక కొడుకు పంచనే చేరాడు.

అరవయ్యేళ్ళు వచ్చేసరికి వంట్లో సత్తువ ఇంకిపోయింది. అలాగని ఆకలి మాత్రం ఇగిరిపోలేదు. కొడుకు కష్టంతో బ్రతకడం ఇష్టం లేకపోయింది. తన వయసుకు తగ్గ పనికోసం యోచన

తప్పలేదు.

కాపలా ముత్తడు చనిపోవటంతో మరో కాపలావాడు వూరి కామందులకు అవసరమైనాడు. తనమీద రైతులకున్న నమ్మకంతో ఆ స్థానం ఆక్రమించుకోగలిగాడు ఆదం. పంట పొలాల కాపలాకు కాయకష్టంతో అంత పనిలేదు. కంటిమీద కునుకు లేకుండా రాత్రిళ్ళు గస్తీ తిరిగితే చాలు. సంవత్సరానికి ఒకసారి సంక్రాంతికి రైతులు తలా కాస్త ధాన్యం కొలుస్తారు. ఆ విధంగా తిండి గింజలకు లోటు రాదనుకున్నాడు. తన బ్రతుకుబరువు కొడుకు మోయసక్కరలేదని సంతోషించాడు.

ఆదం కాపుచేలకు వెళ్ళేసరికి చీకటి పడింది. ఎత్తుగావున్న మట్టిదిబ్బ మీద వేసున్న చుట్టు గుడిసె ముందు ఆగాడు. రాత్రిళ్ళు అదే ఆదం స్థావరం.

లాంతరు నేలమీద వుంచి కనుచూపు మేర కలయజూశాడు.

మిణుగురులు నిప్పురవ్వల్లా ఎగురుతున్నాయి. వరికుప్పలు చీకటి ముద్దల్లా చుట్టూ పరుచుకుని కనిపిస్తున్నాయి. కీచురాళ్ళ రొద చెవుల్ని చిల్లులు పొడుస్తున్నట్లుంది. దిబ్బ మీదున్న రావి చెట్టు ఆకులు అంచెలంచెలుగా వీస్తున్న గాలికి రెపరెప లాడుతూ నిశ్శబ్దాన్ని తట్టి లేపుతున్నాయి. తాటిచెట్ల వరుసలు బారులు తీరిన గస్తీ సిపాయిల్లా వున్నాయి.

ఆదం దిబ్బమీద చతికిలబడ్డాడు. రోజుటిలా చలిగాలి విసురుకు వణికిపోతూ గాజు పురుగులా ముడుచుకు పోలేదు. కుంపట్లో కూర్చునట్లుగా కోటు వెచ్చదనాన్నిస్తున్నది. కోటు జేబులో నుండి

పొగాకు కాడతీసి నోటితో ఆవిరిపట్టాడు. ఒక పాయలాగి చుట్ట చుట్టుకున్నాడు. వెలిగించి గుప్పుగుప్పున పొగవదులుతుంటే ఎన్నడూ లేనంత కమ్మగా వున్నది.

ఆ ఏసుప్రభువు తన మొర ఆలకించి దొరకోటు ఇచ్చి పంపాడన్న భక్తి భావంతో ఆదం మనసు నిండిపోయింది.

"ప్రభువా, నీ బిడ్డల్ని చల్లంగచూడు." అనుకున్నాడు పదేపదే.

ఆ సమయంలోనే ఆదం మనసులో కొడుకు ఏసుపాదం మెదిలాడు.

"పిచ్చినన్నాసి! ఎట్టాగున్నాడో!" అనుకున్నాడు ప్రేమగా.

అంతలోనే, "ఎర్రెదవ, ఎర్రెదవ." అంటూ కళ్ళొత్తుకున్నాడు.

ఆ ప్రభువుకు కొడుకుమీద ఇంకా దయరాలేదు కాబోలని జైల్లోవున్న కొడుకును గురించి అనుకున్నాడు.

వాడేవుంటే ఇవ్వాళ దొరకోటు తెచ్చుకున్నందుకు ఎంతో గొడవ అయ్యుండేదనుకున్నాడు. మతంవాళ్ళు ఇచ్చేవి పుచ్చుకోవటం కొడుక్కి గిట్టేదికాదు. ఇస్రాయిల్ పాస్టరంటేనే మండిపడేవాడు.

పల్లెలోకి కార్లలో దొరలు వస్తుండేవాళ్ళు. ఏసుప్రభువు గురించి గంటల తరబడి చెప్పేవాళ్ళు. ఆ భాష ఆదంకు అర్థం అయ్యేదికాదు. ఇస్రాయిల్ అర్థమయ్యేలా చెపుతుంటే చెవిగోసుకు వినేవాడు. పేదలంటే ఏసుప్రభువుకు ఎంతప్రేమో తెలుసు

కుంటుంటే ఆదం వళ్ళు పులకరించేది.

"ఇలాంటి ఏసయ్యనా సిలువేసింది." అంటూ ఏడ్చేసేవాడు.

దేవుడి పేరుమీద గోషమలిచ్చేవాళ్ళు. బట్టలిచ్చేవాళ్ళు. ఓసారి గోషమలు తీసికెళ్తే నానామాటలన్నాడు ఏసుపాదం.

"ఏందయ్యా! ముస్తైత్తుకున్నావా?" అన్నాడు కోపంగా.

"ముస్టేందిరా! ప్రభువుదయ!" అన్నాడు ఆదం.

"ఈరోజుతోసే బతుకులు ఎల్లమారతాయనుకున్నావా?"

"రోజూ ఆల్లుమాత్తరం యాడ్నించి తెచ్చిత్తార్రా!"

"ఓరోజు బాగ్గేనికి కళ్ళుర్తి ఎందుకు? మన రెక్కల కట్టం మనకు తప్పుద్దా!"

"దయగల మారాజులు పేదోల్లని దయతో ఇచ్చారు. ఇందులో తప్పేవుంది?" అన్నాడు బాధగా.

"అవునయ్యా! పేదోల్లంటే ఆల్లదయ ఇంత గొప్పగా వుండబట్టే నేనూ, నువ్వూ, నీఅయ్యా, వాడయ్యా, వాడ్ని కన్నయ్యా అంతా కూలోల్లుగానే బతుకుతున్నాం. కూటికి మొగంవాసిపోతన్నాం. ఆల్లంతా మన మంచికోసమే దేవుడిపేరు, దేశంపేరూ, చెప్పుకుంటా వుండారు. ఎర్రోల్లం గనుక దన్నాలెడుతున్నాం." అన్నాడు ఏసుపాదం ఆవేశంగా.

"ఏందిరా ఎసకాముందు సూడకుండా పేలిపోతన్నావ్?" అన్నాడు ఉక్రోషంగా ఆదం.

"నిజం మాటాడినోడికి పిచ్చెక్కిందనో, తలపొగరనో పెద్దోల్లంటారు. నీ తోటోల్లందరూ ఆల్లకు వంతపాడతారు. నా రెక్కల

కష్టంతోనే నా వోల్లని బతికించుకోగల్ను. ఆ ముష్టేదో నువ్వే తిను." అంటూ ఛీత్కారించాడు.

ఏసుపాదం మాటలు ఆదం మనసును శూలాల్లాగుచ్చాయి. పుట్టి ఎరిగినాక రెక్కల కష్టంతోనే తను బ్రతికాడు. తన బిడ్డల్ని బ్రతికించు కున్నాడు. మాటలు పడ్డందుకు అభిమానంతో కృంగి పోయాడు. తెచ్చిన గోధుమలు తెచ్చినట్లే తీసుకెళ్ళి ఎవరికో ఇచ్చే శాడు. అవమానంతో ముద్ద నోట్లోకి వెళ్ళింది కాదు.

"అయ్యో! పేదోల్లంతా ఇట్టా మాయలు మోసాల్లో పడిపో బట్టే మన బతుకులు గొంగళ్ళలాగున్నాయి. ఇస్రాయిల్ లాటోల్లు దేవుడి పేరు చెప్పుకుని మనల్ని దోసుకుంటున్నారు." అంటూ బాధ పడ్తున్న తండ్రిని అనునయించాడు ఏసుపాదం.

కొడుకు చీటికి మాటికి ఇస్రాయిల్‌ని అడి పోసుకోవటం ఆదంను భయ పెడ్తున్నది. ఒకప్పుడు పల్లె పల్లెంతా ఒక్క తాటి మీదుండే వాళ్ళు. ఇప్పుడు రెండు వర్గాలయ్యారు.

మిషనరీ వాళ్ళు పల్లెలో పెద్ద చర్చి కట్టించారు. బడిపంతులు ఉద్యోగం చేస్తున్న ఇస్రాయిల్ మతం పుచ్చుకుని పాస్టరయ్యాడు. పల్లెంతా మతంలో చేరింది. పేర్లు మారాయి. ఇస్రాయిల్ పేట వాళ్ళ కోసం బడి పెట్టించాడు. తిండీ. బట్టా సమకూర్చి చదువులు చెప్పిస్తున్నాడు. నాలుగు అక్షరం ముక్కలు పిల్లలకు అబ్బుతున్నా యంటే అది ఇస్రాయిల్ చలవేనని చాలా మందిలానే ఆదం నమ్మాడు. అలాంటి ఇస్రాయిల్‌ని డేవిడ్ వర్గంవాళ్ళు అన్యాయంగా దుమ్మెత్తి పోస్తున్నారని ఆదంలా చాలామంది అనుకుంటున్నారు.

ఒకప్పుడు ఇస్రాయిల్, డేవిడ్ మంచి స్నేహితులు. ఉన్నట్లుండి ఇద్దరికీ మధ్య పగ రగిలింది. ఇస్రాయిల్ అవినీతికి పాల్పడుతున్నాడని డేవిడ్ ప్రచారం మొదలెట్టాడు. తన పేరు ప్రతిష్టలకు ఓర్వలేక డేవిడ్ తప్పుడు మాటలాడుతున్నాడని ఇస్రాయిల్ అంటున్నాడు. వాళ్ళిద్దరి మాటలపైవున్న విశ్వాసాన్నిబట్టి పల్లె రెండుగా చీలింది.

ఒకరోజు ఆదంకు ఇస్రాయిల్ కబురెట్టాడు. "పెద్దయ్యా! నీ కొడుకును అదుపులో పెట్టు. లేకుంటె తర్వాత విచారిస్తావు." అంటూ గట్టిగా హెచ్చరించాడు.

ఆదం కొడుకును మందలించబోయాడు.

"అయ్యా! ఇస్రాయిల్ బడిపంతులుగా వున్నప్పుడు పూరి గుడిసెలో వుండేవోడు. ఇయ్యాల పెంకుటిల్లు కట్టాడు. మోటర్ సైకిల్ కొన్నాడు. ఆడిపిల్లని పట్నంలో సదివిత్తన్నాడు. ఈ డబ్బంతా ఒక్కసారి యాడ్నించి వచ్చింది?" ప్రశ్నించాడు.

"ఆడ్ని దేవుడు కనికరించాడు. పైకొచ్చాడు."

"దేవుడు కనికరించకపోవటానికి మనం ఏం పాపం చేశామయ్యా?" నిగ్గదీశాడు ఏసుపాదం.

"ఆడదురుట్టం ఆడిది. మన దురదుట్టం మనది."

"ఆలాగని అందర్ని నమ్మించబట్టే వాడి ఆటలు సాగుతున్నాయి. మిసనోల్లు బీదా బిక్కికి ఇమ్మన్నదాంట్లో సగం మింగేత్తన్నాడు. బడిపిల్లల నోటికాడు కొట్టి సొమ్ము ఎనకేత్తున్నాడు. మన బతుకుల మీద ఆడు నిచ్చెన్లేత్తన్నాడు." ఆవేశంగా పిడికిళ్ళు

బిగించాడు ఏసుపాదం.

“ఒరేయ్! ఇస్రాయెల్ దేవుడి మనిషి అడ్నంటే గుడ్డు పోతయి.” అన్నాడు ఆదం భక్తిగా.

“ఆయుగాలం కష్టపడే మనకు దేవుడ్ని చేరుకునే మార్గంకాదు తెలవాల్సింది. ఈ దరిద్రాన్ని గట్టెక్కించేదారి. మన బతుకులు ఇంత అద్ధాన్నంగా ఎందుకున్నాయో తెలియాలి. మన బతుకుల్ని కమ్మిన చీకటిని తరిమే ఎలుగు ఎలావత్తదో సెప్పేదేవుడు కావాలి. పొద్దొడిసిన కాడ్నుంచి పొట్టకూటి కోసం ఆరాటపడే మనకు ఈ బోధలు ఏ పాటి కడుపునింపుతయి?” అన్న కొడుకు మాటలకు ఆదం నోరు పెగల్లేదు.

కూలివున్ననాడు కష్టపడటం, కడుపునిండా తినటం, కూలి లేనినాడు కాళ్ళుముడుచుకుని పడుకుని పస్తులుండటం తప్ప ఏ విధమైన ఆలోచనలు లేకుండా బతకటానికి అలవాటుపడ్డ ఆదం, వెలుగుబాట వెతుక్కుంటున్న కొడుకు ఆలోచనా ధోరణుల్ని తన బుర్రలో ఇముడ్చుకోలేక పోయాడు.

పేదపిల్లలబడిలో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెళ్ళటంతో మిషనరీ వాళ్ళు హఠాత్తుగా తనిఖీకి వచ్చారు. ముందే ఈ విషయం పసిగట్టిన ఇస్రాయెల్ నష్ట పోయిందేమీలేదు. గిట్టని వాళ్ళు చేసిన ఫిర్యాదులుగా వాళ్ళని చక్కగా నమ్మించగలిగాడు.

ఆ తర్వాతే అసలు రగడ మొదలైంది. కత్తులు, కటార్లతో

ఇరువర్గాలవాళ్ళూ తలపడ్డారు. తలలు పగిలాయి. కాళ్ళూ, చేతులూ విరిగాయి. ఒకప్రాణం పోనే పోయింది. పోలీసువ్యాన్లు వచ్చాయి. పల్లెలో కనపడ్డ మగాడ్నల్లా చితకబాదేరు. జైల్లో తోసి కేసులు బనాయించారు. కోర్టులకు ఈడ్చారు.

కొందరికి యావజ్జీవ ఖైదు శిక్షపడింది. ఏసుపాదానికి ఐదేళ్ళ జైలుశిక్ష పడింది. ఆదం దుఃఖానికి అంతులేదు. ఇస్రాయిల్ కాళ్ళు పట్టుకున్నాడు.

"పెద్దయ్యా! ప్రభువు నిర్ణయం అలా వున్నది! మనమేం చేయగలం." అంటూ చేతులు దులుపుకున్నాడు.

ఏదో శబ్దం చెవుల్ని తాకేసరికి ఉలిక్కిపడ్డాడు ఆదం.

ఆరిన చుట్టను చెవిలో పెట్టుకొని, పోటుకర్ర చేతిలోకి తీసుకుని లేచి నిలబడ్డాడు. పరకాయించి చూసేడు. దొంగ గొడ్డొకటి మినపమొక్కలు మేస్తూ కనిపించింది. కేకలేస్తూ అటుకేసి పరిగెత్తాడు. దాన్ని తరిమి తరిమికొట్టి తిరిగొచ్చాడు. చుట్టను తిరిగి వెలిగించుకుని నింపాదిగా కాలుస్తూ కూర్చున్నాడు.

* * *

మిట్టమధ్యాహ్నం. ఎంత చిటపట లాడిస్తున్నది. ఏదో పోగొట్టుకున్నట్లు పల్లెంతా తిరుగుతున్నాడు ఆదం. వాడి మనసు మనసులో లేదు. మసవడికి జ్వరం. ఉదయం నుండి మూసిన కన్ను తెరవనేలేదు.

ఉదయం ఆ వూరి డాక్టరుకు చూపెట్టారు తను, కోడలూ వెళ్ళి. పరీక్ష చేశాడు.

"ఎప్పట్నుంచి జ్వరం ?"

"మూడ్రోజుల్నుండయ్యా."

"ఇప్పటిదాకా మరి ఏం చేస్తున్నట్లు ?"

"ఏదో చిటకా వైయిద్యం చేశానండి. తగ్గలా." కోడలు చెప్పింది.

డాక్టరు కస్సున లేచాడు. ప్రిస్కిప్షన్ చేతిలో పెట్టాడు మందులు కొనుక్కురమ్మని.

"అయ్యా! కనికరించాలి. చేతిలో పిల్లిగవ్వలేదు. బిడ్డ అన్యాయమై పోతాడు." గొల్లుమంది కోడలు.

డాక్టర్ చిరాకు పడ్డాడు "ఏదో పేదవాళ్ళులెమ్మని వైద్యం ఉచితంగా చేయగలనుగాని మీలాంటి వాళ్ళందరికీ మందులు నేనేద తేను. వెళ్ళి మందులు తెచ్చుకోండి." నిష్కర్షగా చెప్పాడు.

కోడల్ని, మనవడ్ని హాస్పిటల్లోనే వుంచి చీటీ తీసుకుని మందుల షాపుకి పరిగెత్తాడు ఆదం. మొత్తం యాభై రూపాయ లిమ్మన్నాడు షాపువాడు. డబ్బులేదన్నాడు ఆదం. అయితే మందు లూ లేవన్నాడు షాపువాడు. రైతులు ధాన్యం కొలవగానే అమ్మి డబ్బు తెచ్చిస్తానన్నాడు ఆదం. అప్పుడే మందులూ ఇస్తాం లెమ్మని కసిరి కొట్టారు.

అప్పట్నుండి యాభై రూపాయలకోసం తిరుగుతూనే వున్నా డు. డబ్బులు పుట్టలేదు. అందుకని మందులు కొన్లేదు. మందులు దొరకలేదు గనుక హాస్పిటల్‌కేసి వెళ్ళలేదు. మగతలో పడున్న మనవడ్ని తలుచుకుంటూ కుమిలిపోతున్నాడు ఆదం.

తిరుగుతూ తిరుగుతూ చర్చి దగ్గరకెళ్లాడు.

"ఏసుప్రభువా ! మనవడికేదన్నా అయితే కొడుక్కి ఏం చెప్పుకోను. కరుణించుప్రభూ !" అంటూ చేతులు జోడించి వేడు కున్నాడు.

నాలుగడుగులు వేసేసరికి ఒక గుంపు కనిపించింది. ఆ గుంపు మధ్యలో మిషనరీ వాళ్ళు పంచిసబట్టలు కొంటున్న పట్నం వాళ్ళు కనిపించారు. వాళ్ళకేసి వెర్రిగా చూసేడు.

"ఏరా అమ్ముకుంటన్నారా ?" అన్నాడు దీనంగా.

"అమ్మకోక ఏంచేత్తాం." అన్నారంతా.

గుంపు మధ్యలో గుట్టగాపడున్న బట్టలు చూసేడు. పల్లె వాళ్ళచేతుల్లో రెపరెపలాడుతున్న పచ్చనోట్లు కనిపించాయి. వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి.

"అవ్వనొరే! మనం మనకోసరం ఏం మిగుల్చుకోగలంరా!" అంటూ ఓ వెర్రి కేకేసి గుడికేసి పరిగెత్తాడు ఆదం.

* * *

ఆదం రోజులానే సాయంత్రం కాపలాకు బయల్దేరాడు. వాడి ముఖం వడలిన ఆకులా వున్నది.

"మావా ! దొరకోటు ఏసికెల్లవేం ?" అంటూ కేకేసి గుర్తు చేసింది ఆదం కోడలు.

ఆదం మాట్లాడలేదు. నీరసంగా వెనుదిరిగాడు. కోడలి వడిలోవున్న మనవడికేసి సంతృప్తిగా చూసేడు. జ్వరం తగ్గు ముఖం పట్టి తేట పడ్తున్నాడు.

వాడి ముఖాన పాతకంపు వేలాడుతున్నది. హోటుకర్ర, పొక్కులాంతరు చేతబట్టుకున్నాడు. ఉసూరుమంటూ అడుగులో అడుగేసుకుంటూ వూళ్ళోకి సాగేడు. ఈ పది రోజులుగా వాడిలో వున్న ఉత్సాహం ఈ రోజు లేదు.

ఆదం పాతరూపాన్ని వూరి జనం చిత్రంగా చూసేరు.

"ఏరా! వేషం మళ్ళీ మార్చేశావేట్రా! నీ బొరకోటు ఏమైంది? ఎంత గిట్టుబాటు అయింది ?" కోటు ఒకటి తెచ్చిపెట్టమని లోగడ అడిగిన ఆసామి హాస్యం చేశాడు.

ఆ మాటకు ఆదం మనసు విలవిలలాడింది. కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"పేదోణ్ణి.... ఏం చేత్తానయ్యా....పిల్లగాడికి జొరం. డబ్బుల్లేక...." అక్కడ నిలబడలేక ముందుకుసాగేడు ఆదం.

అక్కడున్న నలుగురూ పకాల్న నవ్వేరు.

కన్నీటి తడికి మసకబారిన ఆదం కళ్ళల్లో బొరకోటు ఇంకా అలలు అలలుగా కదులాడింది. కొడుకన్న మాటలు వాడి గుండెలో సెగలు పుట్టిస్తున్నాయి.

( స్వాతి, నవంబరు 1985 )